# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వము

పత్రికా ప్రకటన-9 తేదిః 23.9.2014.

సమైక్య పాలనలో అణచివేతకు గురైన తెలంగాణ సంస్కృతి పునరుజ్జీవనానికి బతుకమ్మ పండుగ నాంది పలకాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆకాంక్షించారు. తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ పండుగను సాంస్కృతిక పునరుజ్జీవన వేడుకగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ సెక్రటేరియట్ మహిళా ఉద్యోగుల సమాఖ్య రూపొందించిన కోటి బతుకమ్మల జాతర పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం బతుకమ్మ ఉత్సవ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. సమైక్య పాలనలో తెలంగాణ పండుగలు కూడా నిర్లక్ష్యానికి గురయ్యాయని, ప్రభుత్వ సెలవుల్లో కూడా వివక్ష తప్పలేదని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో పండుగలకు సెలవులు ఇచ్చే విధంగా ఎడ్యుకేషనల్ క్యాలండర్ ఇయర్ రూపొందించాలని విద్యాశాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. బతుకమ్మ, దసరా పండుగలను కలుపుకుని ప్రతి ఏడాది 15 రోజులు సెలవులు ఇవ్వాలని, సంక్రాంతికి రెండు రోజులు సెలవులు ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలన్నీ ఈ సెలవులను ఖచ్చితంగా పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

బతుకమ్మ పండుగ ఓ కులానికో, ఓ మతానికో సంబంధించిన ఉత్సవం కాదని, ఇది తెలంగాణ సమాజమంతా కలిసి జరుపుకునే వేడుక అని ముఖ్యమంత్రి చెప్పారు. అనేక ప్రత్యేకతలు, అద్వితీయ లక్షణాలు ఉన్న బతుకమ్మ పండుగ కోసం ఖర్చుకు వెనుకాడకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. తెలంగాణలో అన్ని పండుగలను సామూహికంగానే నిర్వహించుకుంటారని, ఇది తెలంగాణ ప్రజల సామాజిక చైతన్యానికి నిదర్శనమన్నారు. దసరా పండుగ రోజు పాల పిట్టను చూడటానికి వెళ్లినా, జమ్మి చెట్టు వద్దకు పూజలు చేయడానికి పోయినా, పీర్ల పండుగ జరుపుకున్నా, వన భోజనాలకు వెళ్లినా ఊరంతా

కలిసే చేసుకుంటారని ముఖ్యమంత్రి చెప్పారు. బతుకమ్మ పాటల్లో కూడా దేవతలను కొలవడం దగ్గరునుంచి కుటుంబ బాంధవ్యాల వరకు అన్నీ అంశాలు ఉంటాయన్నారు. పురాణ వ్యక్తులు, చారిత్రక పురుషులు, వీర గాథలు, కుటుంబం, బంధుత్వాలు, సంబంధాలు, త్యాగం, ప్రేమ లాంటి వన్నీ బతుకమ్మ పాటల్లో కనిపిస్తాయన్నారు. నిరక్షరాస్యులు కూడా బతుకమ్మ పాటలను రాగ యుక్తంగా పాడుతారంటే వారి జీవితాల్లో బతుకమ్మ ఎలా భాగమయ్యిందో అర్ధం చేసుకోవచ్చన్నారు. అందుకే బతుకమ్మ పండుగను తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవన సాధనకు ఓ ప్రేరణగా చూడాలన్నారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, ప్రభుత్వ సలహాదారు కెవి.రమణాచారి, ఎంపి బి.వినోద్‌కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి పూనం మాలకొండయ్య, సిఎంఒ అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వము

పత్రికా ప్రకటన-10 తేదిః 23.9.2014.

నవంబర్ 6న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే గురు నానక్ 545వ జయంతిలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పాల్గొననున్నారు. గురుద్వారా శ్రీ గురు సింగ్ సభ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి గురునానక్ జయంతి వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

---

సిపిఆర్ఓ టు సిఎం